క్లుప్తంగా

బాణసంచా దుకాణాలకు 53 దరఖాస్తులు



గొల్లప్రోలులో బాణసంచా దుకాణాల ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పిఠాపురం: నియోజకవర్గంలోని పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీ, గొల్లప్రోలు, పిఠాపురం, యు.కొత్తపల్లి మండలాల్లో బాణసంచా దుకాణాలకు అనుమతి కోసం 53 దరఖాస్తులు వచ్చినట్లు ఫైర్ ఆఫీసర్ రామకృష్ణంరాజు తెలిపారు. ఆయన ఆదివారం గొల్లప్రోలు తహసీల్దార్ సత్యనారాయణ, గొల్లప్రోలు ఎస్సై నాడు రామకృష్ణలతో కలిసి గొల్లప్రోలులో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసే ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజవర్గంలోని 53 షాపులకు తాత్కాలిక లైసెన్సులకు దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇందులో గొల్లప్రోలుకు సంబంధించి 22 దరఖాస్తులు రాగా పిఠాపురం మండలం ఫక్రుద్దీన్ పాలెం, గొల్లప్రోలులో పర్మిట్ లైసెన్స్‌దారులు ఇద్దరు ఉన్నట్లు తెలిపారు. దుకాణదారులు తీసుకోవలసిన జాగ్రత్తలు, రక్షణ చర్యలను దుకాణదారులకు వివరించారు. గొల్లప్రోలు తహసీల్దార్ సత్యనారాయణ మాట్లాడుతూ బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసే వారు తప్పనిసరిగా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే దుకాణాన్ని ఎటువంటి నోటీసు లేకుండా తొలగిస్తామని హెచ్చరించారు.

పట్టణ సుందరీకరణకు ప్రణాళిక



శతాబ్ది పార్కును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

పెద్దాపురం: ప్రణాళికాబద్ధంగా పట్టణ సుందరీకరణకు చర్యలు చేపడుతున్నామని, ఇందులో భాగంగానే శతాబ్ది పార్కును మరింత అభివృద్ధికి చర్యలు చేపట్టినట్టు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. 'శతాబ్ది పార్కులో వసతులు కరవు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించి, అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. దీనిలో భాగంగా ఆదివారం రాత్రి పార్కు అభివృద్ధిపై మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజుతో కలిసి పార్కును సందర్శించారు. అక్కడ నూతనంగా ఏర్పాటు చేయదల్చిన ఫుడ్ కోర్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ, త్వరలోనే పార్కు, పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం పార్కులో ఏర్పాటు చేసిన అమరావతి ఫుడ్ కోర్టును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పద్మావతి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

రేపు వేట్లపాలెం పంచాయతీలో విచారణ

సామర్లకోట: మండలంలోని మేజర్ పంచాయతీ అయిన వేట్లపాలెంలో నిధుల దుర్వినియోగంపై మంగళవారం విచారణ జరుగుతుందని డీపీఓ కె.అన్నామణి తెలిపారు. రికార్డులను అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శికి, పంచాయతీ విస్తరణాకారికి ఉత్తర్వులు జారీ చేశారు. 2017–18 నుంచి 2022–23 వరకు వేట్లపాలెం పంచాయతీలో నిధుల దుర్వియోగం విషయమై లోకాయుక్తలో కేసు నమోదైంది. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 29వ తేదీన జెడ్పీ సీఈఓ, జిల్లా ఆడిట్ అధికారి వేట్లపాలెం పంచాయతీకి హాజరై, రికార్డులను పరిశీలిస్తారని డీపీఓ తెలిపారు.

సినిమాలు



పెద్దాపురం	
లలితా స్క్రీన్–1	వీనమ్
లలితా స్క్రీన్–2	దేవర పార్ట్–1
వీరభద్ర	లగ్గం
శోభా	పొట్టేల్
సామర్లకోట	
అనుశ్రీ స్క్రీన్–1	దేవర పార్ట్–1
అనుశ్రీ స్క్రీన్–2	జనక అయితే గనక
విఘ్నేశ్వర	వీనమ్
పిఠాపురం	
అన్నపూర్ణ	గ్యాంగ్ స్టార్
శ్రీపూర్ణ	దేవర
శ్రీసత్య	సత్యం సుందరం
శ్రీవెంకటేశ్వర	మిస్టర్ సెలబ్రిటీ
ఉప్పాడ	
శ్రీనివాస	దేవర

కార్తికం.. మహా పవిత్రం

- పంచారామ క్షేత్రంలో పుణ్య మాసానికి ఏర్పాట్లు పూర్తి
- భారంగా మారుతున్న స్వామి, అమ్మవార్ల దర్శనం
- ప్రత్యేక దర్శనాల పేరిట భక్తులకు టిక్కెట్లు
- ప్రతిరోజూ ఆలయంలో లక్ష పత్రి పూజలు



సామర్లకోటలోని శ్రీబాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయం



ఆలయంలో బారికేడ్లు కడుతున్న కూలీలు



కోనేరులో నీటిని మార్చే ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈఓ



ఆలయానికి చేస్తున్న విద్యుద్దీపాలంకరణ

సామర్లకోట: కార్తిక మాసంలో నెల రోజుల పాటు భక్తులకు మెరుగైన సేవలందించడం కోసం పంచారామ క్షేత్రమైన శ్రీబాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయంలో స్వామివారిని, అమ్మవారిని దర్శించుకోవడానికి ఉచిత దర్శనంతో పాటు రూ.20, రూ.50, రూ.100 ప్రత్యేక దర్శనాలకు టిక్కెట్ల రేట్లు నిర్ణయించారు. అభిషేకాలకు రూ.200, లక్షపత్రి పూజలకు రూ.2,500 చెల్లించాలని అధికారులు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయా టిక్కెట్లు తీసుకున్న వారు దర్శనం చేసుకోవడానికి క్యూలైన్లు ఏర్పాటు చేశారు. కార్తిక మాసంలోని సోమవారాలు, కార్తిక పౌర్ణమి రోజున మాత్రమే పంచామృతాలతో అభిషేకాలు చేయడానికి అనుమతులున్నాయి. కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ప్రతిరోజూ భక్తుల ఆధ్వర్యంలో లక్ష పత్రి పూజలు నిర్వహిస్తారు. పంచారామాలు దర్శించుకునే భక్తులకు దర్శనం పూర్తయ్యే వరకు ఆలయం తెరిచి ఉంచుతారు. కార్తిక మాసంలో నెల రోజుల పాటు ప్రతి రోజు ఉదయం గోపూజ, లక్షపత్రి పూజలు, సాయంత్రం విఘ్నేశ్వరుని పూజలు చేస్తారు. లక్ష పత్రి పూజలు చేసుకునే వారి కోసం ఆలయ దీపారాధన సంఘం ఆధ్వర్యంలో జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేస్తారు.

ఒకటి నుంచి కార్తిక పూజలు

నవంబర్ ఒకటి నుంచి డిసెంబర్ రెండో తేదీ వరకు కార్తిక మాసం ఉత్సవాలు నిర్వహిస్తారు. నవంబర్ ఒకటి శుక్రవారం సాయంత్రం ఆకాశ దీపంతో కార్తిక మాస దీపోత్సవాలను ప్రారంభిస్తారు కార్తిక మాసంలో నవంబర్ 4, 11, 18, 25 తేదీల్లోని సోమవారాలు, ఐదు ఆదివారాలు ప్రత్యేక పూజలుంటాయి. నవంబర్ 15న కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని స్వామివారి గ్రామోత్సవం, రాత్రి జ్వాలా తోరణం ఉంటుంది. నవంబర్ 19న స్వామివారి ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ కోనేరులో తెప్పోత్సవం జరుగుతుంది. 28న మాస శివరాత్రి పూజలు, డిసెంబర్ ఒకటిన అమావాస్యను పురస్కరించుకుని కోటి దీపాలంకరణ, రెండున పోలి పాడ్యమి సందర్భంగా స్వామివారి జటాజూటం అలంకరణతో ఉత్సవాలు ముగుస్తాయి.

బస్సుల్లో వచ్చే వారికి..

పంచారామాల దర్శనం కోసం బస్సుల్లో వచ్చే వారి కోసం ఆలయం తెరిచి ఉంచుతారు. ఆలయ కోనేరులో భక్తులు స్నానాలు చేసే అవకాశం ఉన్న కారణంగా, నీటిని తొలగించి, కొత్త నీటితో నింపడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు కోనేరులో భద్రత ఏర్పాట్లు చేశారు. ఆలయానికి విద్యుద్దీపాలంకరణ చేస్తున్నారు.

శివుడిని దర్శించుకోవాలి



కార్తిక మాసం ఎంతో పవిత్రమైనది. ఈ మాసంలో శివాలయంలో దీపాలు వెలిగించి పరమ శివుడిని దర్శించుకోవడం ద్వారా చేసిన పాపాలు తొలగిపోతాయి. మానసిక ప్రశాంతత ఏర్పడుతుంది. ఏదో ఒక సోమవారం రోజున, కార్తిక పౌర్ణమి రోజున ఉపవాస దీక్ష చేస్తే అనుకున్న కార్యం సిద్ధిస్తుంది.

– వేమూరి సోమేశ్వరశర్మ, శ్రీచక్ర పండితుడు, పంచారామ క్షేత్రం, సామర్లకోట


మెరుగైన సదుపాయాలు కల్పించాం



గతంలో కంటే కార్తిక మాసంలో ఆలయానికి వచ్చే భక్తుల కోసం మెరుగైన సదుపాయాలకు ఏర్పాట్లు చేశారు. కొనేరులో నీరు మారుస్తారు. గతేడాది ఉన్న టిక్కెట్ల రేట్లనే కొనసాగిస్తున్నాం. కార్తిక సోమవారాల్లో తెల్లవారుజామున 4 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 11 గంటల వరకు ఆలయం తెరిచి ఉంటుంది, సాధారణ రోజుల్లో ఉదయం 4 నుంచి రెండు, సాయంత్రం నాలుగు నుంచి 10 గంటల వరకు భక్తులకు దర్శనం కల్పిస్తారు. ప్రతిరోజూ మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఉంటుంది. ఉదయం, సాయంత్రం ప్రసాద వితరణ చత్నారు.

– భళ్ల నీలకంఠం, ఈఓ, పంచారామ క్షేత్రం, సామర్లకోట

మరిడమ్మకు మఖ నక్షత్ర పూజలు



మరిడమ్మ అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ఆదివారం మఖ నక్షత్ర ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు, చండీ హోమంతో పాటు, బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు అధికారులకు శిక్షణ

సామర్లకోట: విస్తరణ శిక్షణా కేంద్రం(ఈటీసీ)లో ఏడు జిల్లాలకు చెందిన డీపీఓ, డీఎల్‌పీఓ, ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి, సాంకేతిక సిబ్బందికి సోమవారం నుంచి శిక్షణ ఇస్తున్నట్టు ఈటీసీ మేనేజర్ పి.శ్రీనివాసు తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామ రాజు, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని అధికారులకు అభివృద్ధి ప్రణాళికల తయారీపై శిక్షణ ఇస్తామని చెప్పారు. శిక్షణా కేంద్రంలో 11 జిల్లాల అధికారులకు శిక్షణ ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటికే నాలుగు జిల్లాల అధికారులకు శిక్షణ పూర్తయిందని తెలిపారు. శిక్షణ పొందిన అధికారులు మాస్టర్ ట్రైనర్లుగా ఆయా జిల్లాల జెడ్పీ, మండల పరిషత్, పంచాయతీ అధికారులకు శిక్షణ ఇస్తారని చెప్పారు.

బాణసంచా విక్రయాల్లో నిబంధనలు పాటించాలి

తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి



సామర్లకోట: ప్రభుత్వ నిబంధనలను బాణసంచా విక్రయదారులు తప్పనిసరిగా పాటించాలని తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి ఆదేశించారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, సామర్లకోట పట్టణ పరిధిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాణసంచా విక్రయాలు చేసుకోవడానికి అనుమతులు ఇచ్చామని చెప్పారు. ఈ ప్రదేశంలో 13 షాపులకు అనుమతులు ఇచ్చామన్నారు. వేట్లపాలెం కెనాల్ రోడ్డులో 9 షాపులు, పీబీ దేవం, ఉండూరుల్లో ఒకొక్క షాపు ఏర్పాటుకు అనుమతులు ఇచ్చినట్టు వివరించారు. అమ్మకందారులకు అనుమతి ఇచ్చిన ప్రదేశాల్లో మాత్రమే బాణసంచా పరిమితిగా విక్రయించాలన్నారు. షాపుల వద్ద అగ్నిమాపక పరికరాలు, నీళ్ల తొట్టె, పొడి ఇసుక బకెట్లు ఏర్పాటు చేయాలన్నారు. లైటింగ్‌కు సంబంధించి ఎలక్ట్రికల్ వైరింగ్ నాణ్యతతో ఉండాలన్నారు. బాణసంచా విక్రయాల్లో 18 ఏళ్లు దాటిన వారు మాత్రమే ఉండాలన్నారు. ప్రతి షాపు వద్ద లైసెన్సు కాపీలను కనిపించే విధంగా ఉంచాలని సూచించారు. అమ్మకందారులు జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేయించుకుని ఉండాలన్నారు. ప్రతి షాపు వద్ద బాణసంచా విక్రయదారుని పేరు, నిబంధనలు కనిపించేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బాణసంచాను ఈ నెల 29 నుంచి 31 వరకు మాత్రమే విక్రయించాలని తెలిపారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆక్రమణలు అడ్డుకోవాలంటూ ఆందోళన



పిఠాపురంలో ఆందోళన చేస్తున్న క్రైస్తవులు

పిఠాపురం: క్రైస్తవ సమాధుల స్థలం ఆక్రమణకు గురికాకుండా అధికారులు అడ్డుకట్ట వేయాలని కోవాలని కోరుతూ ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి సెమెట్రీ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పిఠాపురంలో ఆందోళన చేపట్టారు. స్థానిక చర్చి సెంటర్లో క్రైస్తవులందరూ ఏకమై ఆక్రమణదారులకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సెమిట్రీ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గత బుధవారం కావాలనే కొందరు ఏబీసీ చర్చి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమాధుల తాళాలు పగులగొట్టారన్నారు. దానిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. 100 సంవత్సరాలకు పైబడి ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవ సమాధుల నిర్వహణ జరుగుతోందన్నారు. గత నాలుగు రోజులుగా ఉన్నతాధికారులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కబ్జాదారులు క్రైస్తవ శ్మశానవాటికను ఆక్రమించాలనుకోవడం దారుణమని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పలువురు క్రైస్తవులు పాల్గొన్నారు.

నేడు సూర్యకాంతం శత జయంతి వేడుక

- గయ్యాళి అత్త పుట్టినూరు వీకే రాయపురం
- ఉత్సవాలకు అభిమానులు, గ్రామస్తుల ఏర్పాట్లు





సూర్యకాంతం పుట్టిన వీకే రాయపురం వ్యూ

సామర్లకోట: ప్రముఖ సినీ నటి, గయ్యాళి అత్తగా గుర్తింపు పొందిన సూర్యకాంతం శత జయంతి ఉత్సవాలు సోమవారం మండలంలోని వీకే రాయపురంలో నిర్వహిస్తున్నారు. వీకే రాయపురానికి చెందిన పొన్నాడ అనంతరామయ్య, వెంకటరత్నమ్మ దంపతులకు 14వ సంతానంగా1924, అక్టోబర్ 28న సూర్యకాంతం జన్మించారు. దాంతో ఆమె శత జయంతి వేడుకలను వీకే రాయపురంలో చేయడానికి ఆమె అభిమానులు ఏర్పాట్లు చేసినట్టు కళాబంధు మరిడయ్య విలేకర్లకు తెలిపారు. చిన్నతనం నుంచి సూర్యకాంతం సినిమాల్లో నటించాలనే మక్కువ ఉండేది. ఈ మేరకు ఆమె నాట్యం నేర్చుకున్నారు. తండ్రి చనిపోయాక మద్రాసు వెళ్లి, జెమినీ స్టూడియోలో ఉద్యోగంలో చేరారు. జెమినీ వారు నిర్మించిన చంద్రలేఖ చిత్రంలో డాన్సర్‌గా అవకాశం వచ్చింది. లలీకుమారి సాయంతో మొట్టమొదటిసారిగా 'నారద నారది సినిమాలో సహాయ నటిగా అవకాశం వచ్చింది.1950లో మొదటిసారిగా సంసారం చిత్రంలో గయ్యాళి అత్త పాత్ర చేశారు. అప్పటి నుంచి ఆ పాత్రలే ఆమెకు గుర్తింపు తీసుకొచ్చాయి. అనేక సాంఘిక చిత్రాల్లో రేలంగి, ఎస్వీ రంగారావు, రమణారెడ్డితో జంటగా నటించారు. ఎన్టీఆర్, ఏఎన్నార్, ఎస్వీఆర్ నటించిన గుండమ్మ కథ చిత్రం ఆమెకు మంచి గుర్తింపు తెచ్చింది. అప్పటి నుంచి సూర్యకాంతం లేని సినిమాలు ఉండేవి కావు. ఆమె 980 సినిమాల్లో నటించారంటే చిన్న విషయం కాదు. పెళ్లి చేసి చూడు, దొంగరాముడు, పాతాళభైరవి, కన్యాశుల్కం, తోడికోడళ్లు, గుండమ్మ కథ, ఇల్లరికం, బ్రహ్మచారి, ఉమ్మడి కుటుంబం, దసరా బుల్లోడు వంటి అనేక సినిమాలు ఆమెకు మంచి గుర్తింపు తెచ్చాయి. సూర్యకాంతం పుట్టిన గ్రామంలో శతజయంతి సందర్భంగా ఆమె విగ్రహం ఏర్పాటు చేయాలని అభిమానులు, వీకే రాయపురం గ్రామస్తులు భావిస్తున్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

పెద్దాపురం: అయ్యప్ప స్వాముల సామూహిక పడిపూజ మండలంలోని గుడివాడ గ్రామంలో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచ్ కనపర్తి చీమదొర స్వామి ఆధ్వర్యంలో సుమారు 2 వేల మంది స్వాములు పూజలో పాల్గొన్నారు. లక్ష బిల్వార్చన, దీపాలంకరణ, 18 మెట్ల పూజను నిర్వహించారు.

కాకినాడ-వేమగిరి రోడ్డును హైవేగా మార్చాలి

ఆర్అండ్‌బీ మంత్రికి ఎమ్మెల్యే వినతి

సామర్లకోట: వేమగిరి–కాకినాడ ఆర్అండ్‌బీ రోడ్డును జాతీయ రహదారిగా మార్పు చేయాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి జనార్దనరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఆ లేఖను ఎమ్మెల్యే ఆదివారం ఇక్కడ పత్రికలకు విడుదల చేశారు. 2027లో రాజమహేంద్రవరం గోదావరి పుష్కరాలకు భక్తులు, యాత్రీకుల తాకిడికి అనుగుణంగా రోడ్లు మార్పు చేయాల్సి ఉందన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎంతో ముఖ్యమైన ఈ రోడ్డు 60 కి.మీ. మేర నాలుగు లైన్ల రోడ్డుగా అభివృద్ధి చేయాలన్నారు. ప్రతి రోజు ఈ రోడ్డులో 21,560 ప్యాసింజర్, 2,418 కమర్షియల్ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నట్లు వివరించారు. సామర్లకోట రైల్వే స్టేషన్, కెనాల్ రోడ్డు వెంబడి ఉన్న రైసు మిల్లులు, ఇతర పరిశ్రమల అభివృద్ధి నేపథ్యంలో పుష్కరాల నాటికి రోడ్డు సామర్థ్యం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సామర్లకోట–ప్రతిపాడు రోడ్డు, సామర్లకోట–గోకవరం, కాకినాడ–రాజానగరం ఏడీబీ రోడ్డు, సామర్లకోట–ఉప్పాడ రోడ్లను అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామి వారు

సామర్లకోట: దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ఆలయానికి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాదం, సాయంత్రం ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామివారిని, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరణలు చేశారు. ఆలయ శ్రీచక్ర పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అభిషేక పండితులు అళ్లకి రాజ్‌గోపాల్‌శర్మ, అర్చకులు సన్నిధిరాజు వెంకటరమణ, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

రేపు రీ సర్వే అవగాహన సదస్సు

సామర్లకోట: రైతుల భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి మండలంలోని ప్రతి గ్రామంలోను రెవెన్యూ రీ సర్వే అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మంగళవారం అచ్చంపేట పంచాయతీ కార్యాలయం వద్ద రీ సర్వే అవగాహన సదస్సు జరుగుతుందని చెప్పారు. రైతులు ఈ అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



సంబరంలో శక్తి వేషధారణలు

ఘనంగా బంగారమ్మ తల్లి సంబరం



ప్రత్యేక వాహనంపై బంగారమ్మ తల్లి

సామర్లకోట: పట్టణంలోని చిన్నవీధిలో ఉన్న బంగారమ్మ తల్లి సంబరం ఆదివారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రత్యేకంగా పూలు, విద్యుద్దీపాలతో అలంకరణ చేసిన వాహనంపై అమ్మవారికి ఊరేగింపు నిర్వహించారు. బ్యాండ్ మేళం, గరగల నృత్యాలు, ఎలుగుబంటి, పులి వేషాలు, శక్తివేషాలు, బాణసంచా కాల్పులతో సంబరం అంబరాన్ని అంటింది. చిన్నవీధి నుంచి పెద్దవీధి, గాంధీచౌక్, స్టేషన్ సెంటర్, రథం సెంటర్, నీలమ్మ చెరువు, గొల్లగూడెం మీదుగా సంబరం చిన్నవీధికి చేరింది. ఆలయ కమిటీ నాయకులు మోటూరి నగేష్, లోకేష్, సానిపిల్లి హరిబాబు, మలిరెడ్డి వెంకట రత్నం, సత్తిబాబు, మోటూరి ఈశ్వరరావు, పాలకుర్తి రమేష్, చింతల నాగేశ్వరరావు భక్తులకు సేవలందించారు.